క్లుప్తంగా

జీడీ నెల్లూరు ఇన్‌చార్జ్ సీఐగా లక్ష్మన్న



గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ సీఐగా లక్ష్మన్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేస్తున్న లక్ష్మన్నను ఇక్కడికి ఇన్‌చార్జ్ సీఐగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

గేట్‌వాల్‌కు మరమ్మతులు చేయండి



కేశవపురంలో నీరు లీకవుతున్న గేట్‌వాల్

విజయపురం: మండలంలోని కోసలనగరం పంచాయతీ కేశవపురంలో గేట్ వాల్ మరమ్మతుకు గురై నెల రోజులవుతోంది. అధికారులు ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఫలితంగా తాగునీరు అంతా వృథాగా పోతోందని, మిట్ట ప్రాంతాలకు నీరు అందడం లేదని వాపోయారు. దీనిపై ఫిర్యాదు చేయడానికి సచివాలయానికి వెళ్తే పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండడం లేదని చెబుతున్నారు. ఫోన్ చేస్తే సరి చేస్తాలే అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నాడని అంటున్నారు. మండలస్థాయి అధికారులు చర్యలు తీసుకుని గేట్ వాల్ మరమ్మతులు చేపట్టి తాగునీటిని అరికట్టాలని, మిట్టప్రాంతాలకు తాగునీరు అందేలా చూడాలని కోరుతున్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రతి గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేసుకుంటేనే మాతా శిశుమరణాలు జరగవని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతో పాటు మజ్జిగ, పండ్లరసం, ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు నెలసరి వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలన్నారు. అనంతరం 35 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయండి



విజయపురం : చెన్నై–బెంగళూరు జాతీయ రోడ్డు పక్కన సర్వీస్ రోడ్డు వేయాలని బూచివానత్తం గ్రామ రైతులు ఎన్‌హెచ్ పీడీ కార్తీక్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం చెన్నై–బెంగళూరు జాతీయ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బూచివానత్తం రైతులు తమ గ్రామం నుంచి తిరుత్తణి రోడ్డు వరకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. జాతీయ రోడ్డు కోసం బూచివానత్తం రైతులు భూములు ఇచ్చారని, మిగిలిన భూముల్లోకి వెళ్లడానికి సరైన రోడ్డు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వర్షాకాలంలో వీరి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎన్‌హెచ్ పీడీ సానుకూలంగా స్పందించారు.

బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీబంగారమ్మ అమ్మవారు

కార్వేటినగరం: కార్వేటినగరం గ్రామదేవతగా విరాజిల్లుతున్న శ్రీబంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనే, నారికేళీ జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌ను పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళా భక్తులు అమ్మవారికి పొంగళ్లు వండి పిండి దీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై భక్తులు పలువురు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల వరప్రసాదిని

విశాలమైన కళాశాల ప్రాంగణం, ఎటు చూసినా పచ్చదనం.. ఆహ్లాదకర వాతావరణం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సొంతం. ఇంతటి ప్రశాంత వాతావరణంలో విద్యనభ్యసిస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీపడుతూ ఉత్తమ ఫలితాలు సాధించడం కళాశాల మరో ప్రత్యేకత. ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ఈ కళాశాలను పుత్తూరు పట్టణంలో శాతనూరు రంగయ్య శెట్టి (ఎస్ఆర్ఎస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల పేరిట 1983లో ఏర్పాటు చేశారు. 2024 నాటికి నాలుగు దశాబ్దాల కీర్తిని సముపార్జించింది.



పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు నేటితో ఆఖరు
- డాక్టరేట్ అధ్యాపకులచే విద్యాబోధనలు
- న్యాక్‌బీ, బీ డబుల్ ప్లస్ గ్రేడ్లతో ప్రత్యేక గుర్తింపు
- కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధ్యాపకులు

కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థుల సంఖ్య (2023-24)		
డాక్టరేట్ అధ్యాపకులు	అధ్యాపకులు	విద్యార్థులు
29	18	860

కళాశాలలో సింగిల్ మేజర్ సబ్జెక్టులు

బీఎస్సీ	మేథ్‌మేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్.
బీఏ	ఎకనామిక్స్
బీకాం	జనరల్
బీకాం	కంప్యూటర్ అప్లికేషన్స్
బీబీఏ	

పుత్తూరు: పుత్తూరు పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తిరుపతి జిల్లాలోనే అతిపెద్ద కళాశాలగా అవతరించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విద్యార్థుల పరంగా ద్వితీయస్థానంలో ఉన్న పుత్తూరు కళాశాల, జిల్లాల పునర్విభజనలో తిరుపతి జిల్లాలో కలిసింది. దీంతో తిరుపతి జిల్లాలోనే అతిపెద్ద కళాశాలగా అవతరించింది. విశేష అనుభవం, పలువురు డాక్టరేట్ అధ్యాపకులతో కూడిన అధ్యాపక బృందం సమిష్టి కృషితో కళాశాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వ నేతృత్వంలోని నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) నుంచి 2013లో బీ గ్రేడ్, 2021లో బీ డబల్ ప్లస్ ర్యాంకులను సాధించడమే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. బీ గ్రేడ్ సాధించడం ద్వారా రూ.2 కోట్ల ప్రోత్సాహక నగదును సైతం కళాశాల సొంతం చేసుకుంది. సదరు నిదులను కళాశాల అభివృద్ధి పనులకు వినియోగించారు. అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్ఓ) సంస్థ నుంచి గుర్తింపును పొందడం కళాశాల మరో ప్రత్యేకత. జిల్లా కేంద్రమైన తిరుపతి తర్వాత పుత్తూరు పట్టణం ఎడ్యుకేషన్ హబ్‌గా విరాజిల్లుతోంది. కార్పొరేట్ సంస్థల నుంచి తీవ్రమైన పోటీని తట్టుకుని ఉత్తమ ఫలితాలను సాధిస్తుండడంతో కళాశాలలో ఏటా అడ్మిషన్లు పెరుగుతున్నాయి.


కళాశాలలో వసతులు..

విశాలమైన తరగతి గదులు, డిజిటల్, వర్చువల్ తరగతి గదులు, అత్యాధునిక సైన్స్ ల్యాబ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ ల్యాబ్స్, క్రీడా మైదానం, జిమ్ సౌకర్యం, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం, 40 వేల పుస్తకాలు కలిగిన లైబ్రరీ, సెమినార్ హాలు, ఆర్‌ఓ ప్లాంట్‌తో తాగునీటి సౌకర్యం, విద్యార్థినులకు ప్రత్యేక వెయిటింగ్ హాల్, ప్రత్యేక హాస్టల్ వసతి, హైస్పీడ్ ఇంటర్‌నెట్ వంటి సౌకర్యాలు ఉన్నాయి.

జేకేసీ ద్వారా ఉద్యోగ అవకాశాలపై శిక్షణ..

కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల సాధనకై అవసరమైన శిక్షణ అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఉపాధి కల్పనకు అవసరమైన ఉచిత శిక్షణ ఉంది. ప్రముఖ ప్రైవేటు కంపెనీల ద్వారా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. గత నెలలో నిర్వహించిన జాబ్‌మేళాలో కళాశాల నుంచి 15 మంది విద్యార్థులు వివిధ హోదా ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

క్రమశిక్షణతో కూడిన విద్యాబోధనలు..



క్రమశిక్షణతో కూడిన విద్యా బోధనలతోనే ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నాం. విద్యార్థుల కృషి, తల్లి దండ్రుల ప్రోత్సాహం మాకు కొండంత బలం. న్యాక్ గ్రేడ్స్ సాధిస్తూ, ప్రోత్సాహక నిధులతో కళాశాలను మరింతగా అభివృద్ధి చేస్తున్నాం. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ మాపై బాధ్యత మరింతగా పెరుగుతోంది. ఆ దిశగా మా అధ్యాపక బృందం అన్ని వేళలా నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది.

– డాక్టర్ జి.కోటేశ్వరయ్య, ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు



లైబ్రరీని పరిశీలిస్తున్న న్యాక్ బృందం (ఫైల్)



కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్



సైన్స్ ల్యాబ్



కళాశాలలో గార్డెన్

సీజనల్ వ్యాధులపై అవగాహన

విజయపురం : ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పు, కలుషిత నీరు, విష ఆహారం వల్ల విరేచనాలు అయ్యే ప్రమాదం ఉందని, దీనిపై ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ సోమశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆహారం తినే ముందు, మల, మూత్ర విసర్జన తరువాత చేతులను శుభ్రంగా చేసుకోవాలన్నారు. అలాగే ఎప్పుడు శుభ్రమైన నీటినే వాడాలని, చంటి పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలని, ఆ తరువాత సంపూర్ణ పౌష్టికాహారం అందించాలని సూచించారు. 5 ఏళ్లలో ఆరు నెలలకు ఓసారి విటమిన్ ఏ సిరప్ తాగించాలన్నారు. అలాగే రోటా వైరస్‌ను సరైన సమయంలో వేసుకోవాలని, ఒకవేళ విరేచనాలకు గురైతే ప్రభుత్వం అందించిన ఓఆర్ఎస్ ద్రవాన్ని గంటకు ఒకసారి తీసుకోవాలన్నారు. 14 రోజుల వరకు జింక్ మాత్రలు మింగాలన్నారు. మరింత సమాచారం కోసం మీకు దగ్గరలో ఉన్న ఆశా వర్కర్లను సంప్రదించాలన్నారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోండి

నింద్ర: ఖరీఫ్‌లో వేరుశనగ పంటకు ఆశించే చీడపీడలను నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. మంగళవారం మండలంలోని ఎలకాటూరు గ్రామంలో వేరుశనగ పంటను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ చర్యల్లో భాగంగా తప్పనిసరిగా పంటలో మందులు పిచికారీ చేయాలని సూచించారు. వర్షాలు పడుతుండడం వల్ల వేరుశనగ పంటను పచ్చపురుగు, లద్ది పురుగుల ఆశిస్తాయని, వీటి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు మండల పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు, భారీ జరిమానాలు ఉంటాయని తహసీల్దార్ రవి హెచ్చరించారు. మండల పరిధిలోని ముక్కలతూరు, వేల్కూరు, కొట్రకోన, కలిజవేడు రెవెన్యూ గ్రామ పరిధిలోని నీవానదిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక రవాణా చేస్తే ట్రాక్టర్‌కు రూ.50 వేలు, జేసీబీకి రూ.1 లక్ష జరిమానా విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ట్రాక్టర్, జేసీబీల యజమానులు నిబంధనలను అతిక్రమిస్తే మాత్రం చట్టరీత్యా కేసులు నమోదు చేసేందుకు సిఫార్సు చేస్తామన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించండి



గుంట పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓలు

కార్వేటినగరం: విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఎంఈఓ ఎం.విజయకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గుంట పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతిరోజు ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలలోని భోజనం చేసే విధంగా చూడాల్సిన బాధ్యత పాఠశాల హెచ్‌ఎంపై ఉంటుందన్నారు. అనంతరం పాఠశాల రికార్డులతో పాటు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులు డ్రాపౌట్లు లేకుండా చూడాలని సూచించారు. ఎంఈఓ వెంట ఎంఈఓ(2) మనోజ్‌కుమార్, హెచ్‌ఎం యుగంధర్, ఐఆర్‌టీ ఉపాధ్యాయరాలు సింధూజ, సీఆర్పీలు మీనా, గణేష్, కార్తీక్ పలువురు ఉన్నారు.

మొబైల్ బుక్ కీపింగ్‌పై సమీక్ష



డ్వాక్రా మహిళలకు సూచనలు ఇస్తున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం : ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్ సక్రమంగా నిర్వహించాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. మంగళవారం స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్‌ను వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. స్త్రీనిధి రుణాలను పూర్తిగా రికవరీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీలు చిరంజీవి, సంఘమిత్రాలు మురుగయ్య, మంజుల, శోభ, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

విజయపురం : మండలంలోని కాళికాపురం వద్ద రెండేళ్ల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి మరణించాడు. అప్పట్లో అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ నరేష్ విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కార్వేటినగరం మండలం పాదిరికుప్పం గ్రామానికి చెందిన కిరణ్, దామోదరంపై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి విచారణ జరుగుతున్న ఈ కేసుకు సంబంధించి మంగళవారం ఏపీపీ రామ్‌శాంతి వాదనలు వినిపించారు. అనంతరం నగరి జూనియర్ సివిల్‌జడ్జి విష్ణువర్మ వాదనల అనంతరం ట్రాక్టర్ డ్రైవర్ కిరణ్‌కు రెండేళ్ల ఆరు నెలలు జైలు శిక్షతో పాటు రూ.1000 అపరాధం, అలాగే ట్రాక్టర్ యజమాని దామోదర్‌కు మూడు నెలలు జైలు శిక్ష, రూ.1000 అపరాధం విధించినట్లు ఎస్ఐ జయప్ప, కోర్టు కానిస్టేబుల్ ఏలుమలై తెలిపారు.

ఓంశక్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు



మొక్కులు తీర్చుకుంటున్న ఓంశక్తి భక్తులు

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం దళితవాడలో వెలసిన ఓంశక్తి అమ్మవారికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఓంశక్తి మాల ధరించిన భక్తులు అమ్మవారి శూలానికి వివిధ అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక దీపారాధన చేశారు. అనంతరం ఇరుముడి కట్టుకుని మేల్‌మరవత్తూరు వెలసిన ఓంశక్తి అమ్మవారిని దర్శించుకోవడానికి బయలుదేరి వెళ్లారు.

నారాయణమ్మకు నివాళులు



నారాయణమ్మ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న కుమారస్వామి రెడ్డి

విజయపురం : మండలంలోని వరదరాజుకండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల కన్వీనర్ ప్రసాద్‌రాజు తల్లి నారాయణమ్మ (80) మంగళవారం అనారోగ్యం మృతి చెందింది. మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమార్‌స్వామిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట నాయకులు శివరాజు, ప్రతాప్‌రాజు, రమేష్, రాజా తదితరులు ఉన్నారు.

పర్యావరణ రక్షణ మన బాధ్యత



మొక్కలు నాటుతున్న సింగిల్‌విండో అధ్యక్షురాలు గాలి జ్యోతి

పాలసముద్రం : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని సింగిల్ విండో అధ్యక్షురాలు గాలి జ్యోతి తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ ఆవరణలో చెట్లు నాటే కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన సింగిల్‌విండో అధ్యక్షురాలు గాలి జ్యోతి మాట్లాడుతూ వర్షాలు కురవాలంటే కూడా మొక్కలు ఎక్కువగా ఉండాలన్నారు. సమాజంలో పరిశ్రమలు, వాహనాలు పెరుగుతుండడంతో నానాటికీ వాతావరణ కాలుష్యం పెరుగుతోందన్నారు. కాలుష్యం నివారించాలంటే మొక్కలు పెంచడం ఒక్కటే పరిష్కారమన్నారు. భూవిస్తీర్ణంలో కనీసం 33 శాతం మొక్కలు ఉండాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటికి నీరుపోసి బతికించాల్సిన బాధ్యత కూడా ఉందని తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు టీచ్ టూల్



ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేస్తున్న రాష్ట్ర పరిశీలకులు

నగరి : ఉపాధ్యాయులకు టీచింగ్ టూల్ శిక్షణ ఎంతో సహకరిస్తుందని రాష్ట్ర పరిశీలకులు, సర్వశిక్ష అభియాన్ ఎఫ్ఎల్ఎన్ కన్సల్టెంట్ టి.బాలకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించే టీచ్ టూల్ కార్యక్రమం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులను శిక్షణ ఏ మేరకు ఉపయోగపడుతుందో అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు సహాయంతో అనేక పరిశోధనల అనంతరం టీచ్‌టూల్ కార్యక్రమం రూపొందించారన్నారు. ఇది ఉపాధ్యాయులను మదింపు చేసే టూల్ కాదని సహకరించే టూల్ మాత్రమే అన్నారు. విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే టూల్ అన్నారు. శిక్షణా కార్యక్రమం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం, హెచ్‌ఎం పార్వతి దేవి, రీసోర్స్‌పర్సన్లు కోదండ, ఈశ్వరయ్య, సీఆర్పీ శరవణ తదితరులు పాల్గొన్నారు.

నందిపై పరాశరేశ్వరస్వామి చిద్విలాసం

- వేడుకగా స్నపన తిరుమంజనం
- 12న ఆర్జిత కల్యాణోత్సవం



నంది వాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం నంది వాహనంపై స్వామిఅమ్మవార్లు అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. ఉదయం అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను, పరివార దేవతలకు అభిషేకాలు చేసి, నైవేద్య సమర్పణ చేశారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర్లకు సుగంధ, పరిమళ ద్రవ్యాలు, పంచామృతాలతో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలను అందుకున్న ఉత్సవర్లు అలంకరించుకుని నంది వాహనాన్ని అధిరోహించారు. సర్కారు హారతి అందుకున్న దేవరులు గ్రామోత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకుని పురవీధుల్లో విహరించారు. స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బుధవారం సాయంత్రం గజవాహనం అధిష్టించి ఊరేగింపులో ఉత్సవమూర్తులు దర్శనం ఇవ్వనున్నారు. ఈనెల 12వ తేదీన ఆలయ ప్రాంగణంలో చంపకవల్లీ, పరాశరేశ్వరస్వామికి జరిగే ఆర్జిత కల్యాణోత్సవంలో రూ 500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చునని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



పుత్తూరులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పుత్తూరు: వ్యవసాయ శాఖ, ప్రాంతీయ నిఘా తనిఖీ అధికారుల బృందం మంగళవారం పుత్తూరు పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. తిరుపతి ఏడీఏ ధనుంజయరెడ్డి, తనిఖీ బృందం ఏడీఏ ఎల్లప్ప, విజిలెన్స్ అధికారం జీవానందం, పుత్తూరు ఏడీఏ రమేష్‌రాజు, ఏఓ కోదండయ్య విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. స్థానిక గ్రోమోర్, మురుగన్ ఎంటర్ ప్రైజెస్ షాపుల్లో తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 10 కేజీల బ్యాగులు కలిగిన 420 కేజీల ఆర్గానిక్ ఎరువులను సీజ్ చేశారు. పట్టణంలోని ఇతర షాపుల్లోనూ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధనంజయరెడ్డి మాట్లాడుతూ లైసెన్సులు లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్సులు కలిగిన షాపుల్లో సైతం నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.